సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



జాతరెల్లి పోదామా..

అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులోని రేగులగండిలో లింగమంతుల స్వామి జాతర జోరుగా సాగుతోంది. 10లో



బడ్జెట్ ఎలా ఉందంటే..?

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి సోమవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా రాజకీయ పక్షాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు కొద్దిమేర ఎక్కువగా ఉండవచ్చు. రాత్రి వేళ చలి ప్రభావం తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలకు అండగా డిఫెన్స్ కౌన్సిల్



డిఫెన్స్ కౌన్సిల్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులను నియమించుకోలేని పేదలకు జిల్లా లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం అండగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను సోమవారం వర్చువల్‌గా రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ టి.నవీన్‌రావు ప్రారంభించారు. జిల్లా కోర్టులో న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం నలుగురు న్యాయవాదులు నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్యాంశ్రీ, జి. భానుమతి, ఆడెపు నీరజ, బత్తుల రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, ఉపాధ్యక్షుడు శరత్, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, మునిగడప వెంకటేశ్వర్లు, ఎండీ సాధిక్‌పాషా, ఆర్తిమక్కడ్, గాదె సునంద, ఊటుకూరి పురుషోత్తంరావు, పట్టుపల్లి నిరంజన్‌రావు, జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, పోసాని రాధాకృష్ణమూర్తి, ఏవూరి బాబూరావు, పీవీడీ లక్ష్మి, మెందు రాజమల్లు పాల్గొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: సమస్యలను గుర్తించి కంటి చూపును కాపాడుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. సోమవారం ఓఎస్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ దగ్గరి చూపు సమస్య ఉన్నవారికి వెంటనే కళ్లద్దాలు ఇస్తామని తెలిపారు. ఓఎస్డీ సాయి మనోహర్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ పర్షియా నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ టీ. విజయ్‌కుమార్, డీపీఓ దుర్గారావు, సూపర్‌వైజర్ హరి పాల్గొన్నారు.

31 మంది బాల కార్మికులకు విముక్తి.

జిల్లా వ్యాప్తంగా 31 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గత నెల 1 నుంచి 31 వరకు తొమ్మిదో విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. పోలీసు, ఏహెచ్‌డీయూ(యాంటి ట్రాఫికింగ్ యూనిట్), చైల్డ్ లైన్ లేబర్ విభాగాల ఆధ్వర్యంలో పరిశ్రమలు, హోటళ్లలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. 31 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించామని, వారిలో 22 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారని ఉన్నారని వివరించారు. 17 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా చిన్నారులతో పనులు చేయిస్తే 100 లేదా 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాగునీటికి పుష్కలంగా..



సీతారామ ఎత్తిపోతల పథకం

బడ్జెట్‌లో ప్రాజెక్టులకు అధిక నిధులు

- సీతారామకు రూ.963 కోట్లు కేటాయింపు
- మీడియం ఇరిగేషన్‌కు దక్కిన ప్రాధాన్యం
- భద్రగిరి, పర్యాటకానికి రిక్తహస్తం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో మరోసారి ప్రాధాన్యం దక్కింది. అసెంబ్లీల్లో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీరు అందించాల్సిన సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ. 963 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో బ్యారేజ్, ఫ్లడ్ కెనాల్, నిర్వాసితులకు పరిహారం, కాల్వలు, పంజ్‌హౌస్‌ల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. గత బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రూ.998 కోట్లు ప్రకటించగా, వాస్తవంగా రూ.769.64 కోట్లే కేటాయించారు. గోదావరి నదిపై కాళేశ్వరం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సీతారామను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు సాగునీరు అందివ్వడంతో పాటు నాగార్జున సాగర్ ఎడమ కాల్వకింద ఉన్న ఆయకట్టును స్థిరీకరించనున్నారు. 320 మెగావాట్ల జల విద్యుత్ కూడా ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గత బడ్జెట్ లాగానే ఈ సారి కూడా భారీ స్థాయిలో నిధులు కేటాయించారు.

ప్రాజెక్టుల నిర్వహణకు పెద్దపీట..

మీడియం ఇరిగేషన్‌లో భాగంగా చర్ల మండంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టు నిర్వహణ, అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో రూ.5.74 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేవలం రూ.80 లక్షలే ఇచ్చారు. ఈ ఏడాది గోదావరి, దాని ఉపనదులు, వాగులకు వచ్చిన భారీ వరదను దృష్టిలో ఉంచుకుని, కడెం ఘటన నేపథ్యంలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు మెయింటెనెన్స్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫలితంగా తాలిపేరుకు గతంలో పోల్చితే కేటాయింపులు పెరిగాయి. మరోవైపు కిన్నెరసాని ప్రాజెక్టుకు పెద్దపీట వేశారు. గతంలో ఈ ప్రాజెక్టు నిర్వహణ, అభివృద్ధికి రూ,.80 లక్షలు కేటాయించగా ఈసారి ఆ మొత్తం ఏకంగా రూ.27.85 కోట్లకు పెరిగింది. ఇదే తరహాలో గుండ్లవాగుకు రూ.22 లక్షలు, పెద్ద వాగుకు రూ. 25 లక్షల వంతున చెప్పుకోతగ్గ స్థాయిలోనే నిధులు కేటాయించారు.

కొత్త ఇంజనీరింగ్ కాలేజీ..

జిల్లాకో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో మహబూబాబ్‌నగర్‌తో పాటు కొత్తగూడెంలో ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయబోతున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ప్రస్తుతం కొత్తగూడెంలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఒక ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ కేయూ ఇంజనీరింగ్ కాలేజీ నూతన భవనాల నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగానే జవహర్ లాల్ నెహ్రూ (జేఎన్‌టీయూ) పరిధిలో మరో ఇంజనీరింగ్ కాలేజీని జిల్లాకు మంజూరు చేస్తున్నట్టు ప్రకటన వచ్చింది. మరోవైపు రాబోయే విద్యా సంవత్సరం నుంచే మణుగూరు పాలిటెక్నిక్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ భవనాల నిర్మాణాలకు పెద్ద మొత్తంలో కేటాయింపులు జరిగాయి.

భద్రగిరికి మొండిచేయి..

రాష్ట్రంలో వివిధ దేవస్థానాలకు సంబంధించిన టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఈ బడ్జెట్‌లో చెప్పుకోతగ్గ స్థాయిలో కేటాయింపులు జరిగాయి. కానీ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన భద్రాచలం క్షేత్రానికి ఒక్క పైసా కేటాయించలేదు. గత బడ్జెట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. టూరిజంలో జిల్లాకు అపార అవకాశాలు ఉన్నాయంటూ స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పడమే తప్పితే ఈ బడ్జెట్‌లో పెద్దగా నిధుల కేటాయింపు జరగలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రికార్డు స్థాయిలో రూ.70 కోట్ల వరకు కేటాయింపులు జరిగాయి. దానికి ఏమాత్రం తీసిపోని భద్రాద్రి ఆలయం, సీతారామ ప్రాజెక్టు, గోదావరి ఉన్నా మన జిల్లాను ఈ బడ్జెట్‌లో పక్కన పెట్టారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు నిధులు..

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు ఈ బడ్జెట్‌లో రూ.495 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోనే తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాగా భద్రాద్రి కొత్తగూడేనికి పేరుంది. దీంతో ఈ నిధుల్లో సింహభాగం మనకే దక్కవచ్చు. ఇక పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ. 2,000 కోట్లు , ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి మెయింటెనెన్స్‌కు రూ.2,000 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. ఫలితంగా ఈ వేసవి ముగిసే నాటికి జిల్లా వ్యాప్తంగా మెజారిటీ రోడ్లపై గుంతలు, గతుకులు మాయం కానున్నాయి. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి జిల్లా ముందు వరుసలో ఉండటం సానుకూల అంశం.

రగిలిన చిచ్చు..



కలెక్టరేట్ ఎదుట అవిశ్వాస పత్రంతో ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్లు..

- అధికార బీఆర్ఎస్‌లో తారాస్థాయికి అసమ్మతి
- ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసానికి నోటీస్
- హామీలు అమలు చేయలేకపోతున్నామనే ఆవేదనతోనే..
- అవిశ్వాసానికి మొగ్గు చూపామంటున్న కౌన్సిలర్లు
- 15 మంది సంతకాలతో కలెక్టర్‌కు నోటీస్

ఇల్లెందు: ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఎన్నికల్లో గెలిచామని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేకపోతున్నామని, అందుకే అవిశ్వాసం వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందని అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు. సోమవారం ఇల్లెందు మున్సిపల్ పాలకవర్గం నుంచి మెజారిటీ సభ్యుల సంతకాలతో కూడిన నోటీస్‌ను కొత్తగూడెం వెళ్లి కలెక్టర్ అనుదీప్‌కు అందించారు.

కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చిన 12 మంది సభ్యులు

ఇల్లెందు మున్సిపాలిటీలో అధికార బీఆర్ఎస్‌లో ఉన్న విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చేస్థాయికి చేరాయి. పాలకవర్గంలో 24 మంది సభ్యులు ఉండగా, 21 మంది అధికార బీఆర్ఎస్ అభ్యర్థులు ఉన్నారు. ఒకరు సీపీఐ, ఒకరు ఎన్డీ, మరొకరు స్వతంత్ర సభ్యులు ఉన్నారు. వీరిలో 15 మంది సభ్యులు సంతకాలతో కూడిన అవిశ్వాస పత్రాన్ని, 12 మంది సభ్యులు తీసుకెళ్లి కలెక్టరేట్‌లో నోటీస్ ఇచ్చారు. అసమ్మతి కౌన్సిలర్లతో కొందరు సభ్యులు మూడు రోజులుగా మంతనాలు జరిపి, ఏకతాటిపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. నోటీస్ ఇచ్చాక క్యాంపునకు తరలివెళ్లినట్లు సమాచారం.

అసమ్మతి గ్రూపులో ఎవరెవరంటే..

కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు(3వ వార్డు), తోట లలిత శారద(6వ వార్డు), సామల మాధవి (7వ వార్డు), సిలివేరు అనిత(12వ వార్డు), కడకంచి పద్మ(13వ వార్డు), సందా బిందు(14వ వార్డు), గిన్నారపు రజిత (16వ వార్డు), పాబోలు స్వాతి(18వ వార్డు), పత్తి స్వప్న(19వ వార్డు), వాంకుడోతు తార (24వ వార్డు), చీమల సుజాత (15వార్డు), కొండపల్లి సరిత (21వ వార్డు) అవిశ్వాస పత్రంపై సంతకం చేసి, కొత్తగూడెం వెళ్లి కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. చెరుపల్లి శ్రీనివాస్(11వార్డు), మొగిలి లక్ష్మి(21వ వార్డు), కుమ్మరి రవీందర్(23వ వార్డు) సంతకాలు చేసినప్పటికీ కొత్తగూడెం వెళ్లలేదు. కాగా ఇద్దరు సభ్యులు మొగిలి లక్ష్మి, కుమ్మరి రవీందర్‌లు తమకు అవిశ్వాస వ్యవహారంతో సంబంధం లేదని, తాము సంతకాలు చేయలేదని, అయినా తాము సంతకాలు చేసినట్లు ఉన్న పత్రం అందజేసి మనోవేదనకు గురిచేస్తున్నార ని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో ఒకరు అధికార బీఆర్ఎస్ కాగా మరొకరు సీపీఐ అభ్యర్థి ఉన్నారు.

చైర్మన్‌ది ఒంటెద్దు పోకడ..

వార్డుల అభివృద్ధి కోసం దమ్మాలపాటి వెంకటేశ్వరరావును చైర్మన్‌గా ఎన్నుకున్నామని, కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చైర్మన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అవిశ్వాస నోటీస్ ఇచ్చిన కౌన్సిలర్లు విడుదల చేసిన పత్రంతో పేర్కొన్నారు. చైర్మన్ ఒంటెద్దు పోకడతో వెళ్తున్నారని, మున్సిపల్ కౌన్సిల్‌కు ముందు రోజు ఎజెండా, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు కౌన్సిలర్లకు తెలపకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లను, అధికారులను బెదిరిస్తూ, బినామీ కాంట్రాక్టర్లతో టెండర్లు వేస్తూ బిల్లులు చేయించుకుంటున్నారని, కమీషన్ దండుకుంటున్నారని పేర్కొన్నారు. పలుమార్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్తే అవహేళన చేశారని, ఇలాంటి పద్ధతులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతారని భావించి అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించుకున్నామని, అయితే తామంతా ఎమ్మెల్యే హరిప్రియ నాయకత్వంలోనే పని చేస్తామని పేర్కొన్నారు.

అవిశ్వాసంతో ఎలాంటి సంబంధం లేదు



నేను సీపీఐ నుంచి గెలిచిన సభ్యుడిని. నాకు, అధికార పార్టీలో తలెత్తిన వివాదం, అవిశ్వాసంతో సంబంధం లేదు. మా పార్టీ నిర్ణయం ప్రకారం నడుస్తాను. నన్ను ఎవరూ సంప్రదించలేదు. అవిశ్వాస తీర్మానం మీద సంతకం కూడా చేయలేదు. నా పేరుతో ఉన్న సంతకానికి, ఈ అవిశ్వాసానికి ఎలాంటి సంబంధం లేదు.

– కుమ్మరి రవీందర్, 23వ వార్డు కౌన్సిలర్

ఆ సంతకం అవిశ్వాసం కోసం కాదు



ఇటీవల సీఎం కేసీఆర్ కొత్తగూడెం వచ్చిన సందర్భంగా రూ.25 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో పనులు చేపట్టేందుకు తమకు నచ్చిన కౌన్సిలర్లకు పనులు ఇవ్వాలని తీర్మానం చేసి సంతకాలు పెట్టాం. ఆ సంతకాలను అవిశ్వాసం కోసం నేను సంతకం చేసినట్లు చూపారు. నేను అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకం.

– మొగిలి లక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్

ప్రలోభపెడుతున్నారు..

మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా అవిశ్వానికి మద్దతు పలకాలని తమను కొందరు ప్రలోభాలకు గురి చేస్తున్నారంటూ ఆరుగురు కౌన్సిలర్లు సోమవారం రాత్రి ఇల్లెందు సీఐ బి.రాజుకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కొండపల్లి గణేష్, సిలివేరు సత్యనారాయణ, పాబోలు కిరణ్ ఒత్తిడి చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినవారిలో కౌన్సిలర్లు వార రవి(1వ వార్డు), కటకం పద్మావతి(2వ వార్డు), సయ్యద్ ఆజమ్(4 వార్డు), వై. వీణ 5వ వార్డు), మొగిలి లక్ష్మి(20వ వార్డు), అంకెపాక నవీన్ (22వ వార్డు) ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజావాణికి విశేషస్పందన

గైర్హాజరైన ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కలెక్టర్‌కు తమ సమస్యలు చెప్పుకునేందుకు బారులుదీరారు.

సత్వర చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం ఎండార్స్ చేశారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన మత్స్యశాఖాధికారి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తిని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- గోదావరి ముంపువల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వరద ముంపు నుంచి రక్షణకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లో రెండు పడకల గదుల ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బూర్గంపాడు మండలానికి చెందిన కొందరు వినతిపత్రం అందజేయగా, కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.
- సర్వే నంబరు 10లో వారసత్వంగా లభించిన ఇంటిస్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, సర్వే చేయించి హద్దులు నిర్ణయించి తనకు అప్పగించాలని చంద్రుగొండ మండలానికి చెందిన భాషమ్మ ఫిర్యాదు చేయగా, చంద్రుగొండ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- డబుల్ బెడ్ రూం ఇల్లు, పింఛను మంజూరు చేయాలని కోరుతూ చుంచుపల్లి మండలం బాబుక్యాంపునకు చెందిన మట్టపర్తి సుబ్బాయమ్మ అనే వృద్ధురాలు వినతిపత్రం అందించగా, చుంచుపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెం, డోర్నకల్ మధ్య రైల్వే ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గతంలో ఉన్న ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సిటిజన్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కొదమసింహం పాండురంగాచార్యులు వినతిపత్రం ఇచ్చారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

'క్రమబద్ధీకరణ' పూర్తి చేయాలి

- కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): క్రమబద్ధీకరణ పట్టాల విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల్లో జీఓ నంబర్ 76 ద్వారా చేపట్టిన ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులతో చేపట్టనున్న పనులు తదితర అంశాలపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం, ఇల్లెందులలో క్రమబద్ధీకరణ దరఖాస్తుల విచారణలో పూర్తిచేయాలని, సమస్యలు ఉంటే డీఆర్వో దృష్టికి తేవాలని సూచించారు. భద్రాచలం డివిజన్‌లో పంచాయతీ భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గత నెల 12న ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్ ప్రారంభ సమయంలో మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించిన నిధులతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. చింతలచెరువును ట్యాంకుబండ్‌గా అభివృద్ధి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

'వ్యాయామ' అప్‌గ్రేడేషన్‌కు విజ్ఞప్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్‌కు ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కేటీఆర్ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు విప్ రేగా తెలిపారు.

పొంగులేటి సభకు భారీగా శ్రేణులు

- 'పేట' అభ్యర్థిని ప్రకటించిన శ్రీనివాసరెడ్డి
- ఆంక్షలు పెట్టినా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

అశ్వారావుపేట/దమ్మపేట: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి అనుచరులు, అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలోని నెమలిపేట గ్రామ శివారు క్రీడా మైదానంలో సభ నిర్వహించగా, అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల నుంచి భారీగా జనసమీకరణ చేశారు. ఆదివాసీలు తమ సంప్రదాయ కొమ్ము నృత్యంతో సందడి చేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై పూల వర్షం కురిపించి గజమాలతో సన్మానించారు.

అశ్వారావుపేట అభ్యర్థిగా జారే ఆదినారాయణ

ఏ పార్టీలో చేరినా తన తరఫున అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థి జారే ఆదినారాయణేనని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పనిచేసిన తాను.. తెలంగాణ ఉద్యమ అనంతరం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రభుత్వ ఉద్యోగాన్ని త్యజించి టీఆర్ఎస్ తరఫున పోటీ చేశానని, ఆ తర్వాతి పరిణామాల్లో రెండో సారి తనకు టికెట్ దక్కలేదన్నారు. అయినా ఇప్పటివరకు పార్టీ వీడలేదని తెలిపారు. శీనన్నతోనే తన ప్రయాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ వంద ఎకరాలకు పైగా భూములున్న రైతులకు అందే రైతుబంధు.. ఒకటి రెండెకరాలు ఉన్న వారికి అందటం లేదని ఆరోపించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మాట్లాడుతూ శీనన్నను రాజ్యసభకు పంపుతామని వాగ్దానం చేసి మాట తప్పారని విమర్శించారు.

అభిమానం చాటుకున్న అట్టం రమ్య

ఎనిమిది నెలల గర్భిణి అయిన అశ్వారావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ అట్టం రమ్య ఆత్మీయ సమ్మేళనానికి హాజరై పొంగులేటిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

బెదిరింపులను ఖాతర్ చేయని కేడర్

పొంగులేటి సభకు బీఆర్ఎస్ కేడర్ వెళ్లొద్దంటూ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఆదివారం పోస్ట్‌చేశారు. నాయకులు నియోజకవర్గంలోని అన్ని మండలాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ కేడర్‌కు హుకుం జారీ చేశారు. వైరా నియోజకవర్గంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మద్దతుగా నిలిచిన వారిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. కానీ సోమవారం జరిగిన నెమలిపేట సమావేశానికి నిర్వాహకుల అంచనాకు మించి అభిమానులు పోటెత్తారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీలు, రైతుబంధు జిల్లా సమన్వయకర్త వంటి కీలక పదవుల్లో ఉన్న వారు 50 మందికి పైగా హాజరయ్యారు. మరి వీరందరినీ బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తారా..? అలా చేస్తే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని భావిస్తున్నారు. ఈ విషయమై అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును ప్రశ్నించగా పార్టీ నిర్ణయానుగుణంగా స్పందిస్తామని, అసెంబ్లీ సమావేశానంతరం దీనిపై చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రైతుబంధు జిల్లా సమన్వయకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు జూపల్లి రమేష్, ఎంపీపీ బాణోత్ పార్వతి, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, నాయకులు కోటగిరి సత్యం బాబు, రావు గంగాధరరావు, బత్తుల అంజి, పర్సా వెంకట్, భోజ్యానాయక్, యర్రగొర్ల రాధాకృష్ణ, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, చామర్తి గోపిశాస్త్రి, చక్రాల మల్లేశ్వరరావు, సాయిల నర్సీ తదితరులు పాల్గొన్నారు.



పొంగులేటిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన శ్రేణులు

క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ఏఐసీసీ కార్యదర్శులు



ఆలయ ప్రాంగణంలో ఏఐసీసీ కార్యదర్శులతో నాయకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, రోహిత్‌చౌదరి సోమవారం దర్శించుకున్నారు. అంతరాలయంలో మూలమూర్తులు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన తాము, రామయ్యను దర్శించుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, కాంగ్రెస్ పీట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేశ్, నాయకులు బలుసు నాగసతీశ్, సరెళ్ల వెంకటేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా కేసులో కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ఎక్సైజ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో గత ఏడాది మే 3వ తేదీన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్విఫ్ట్ కారులో రూ.4.50 లక్షల విలువైన 150 కేజీల గంజాయి తరలిస్తూ కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజు, బోదాసు రాజు, ఉప్పల నరేశ్ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణలో కుంచెం దేవరాజుపై నేరం రుజువు కాగా, మిగిలిన వారిపై రుజువు కాలేదు. దీంతో దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు వాదించగా, హరిగోపాల్, ఎ.నాగేశ్వరరావు విచారణకు సహకరించారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడి ఒకరు మృతి

14 మందికి గాయాలు



బోల్తా కొట్టిన ట్రాక్టర్ ట్రక్కు

పాల్వంచ: అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఇంజిన్ నుంచి ట్రక్కు వేరుపడి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, 14 మంది గాయపడ్డారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. మండలంలోని ఉల్వనూరు పంచాయతీ లక్ష్మీదేవిపల్లి శివారులో జామాయిల్ కర్రను నరికేందుకు కూలీలు వెళ్లారు. పని ముగించుకుని ట్రాక్టర్ ఎక్కి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగంతో నడపడంతో వెనుక ట్రక్కు ఊడి తిరగపడింది. దీంతో మాడవి భీమ (46) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 14 మందికి స్వల్పగాయాలు కాగా వారిని వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద తీరును పరిశీలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడ్ల బండిని ఢీకొట్టిన ఆటో

వృద్ధురాలు మృతి



గాయపడిన ఆటోడ్రైవర్

పాల్వంచ: ఎడ్ల బండిని ఆటో ఢీకొట్టిన ఘటనలో వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. పాల్వంచకు చెందిన ఆరుగురు మహిళా కూలీలు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో మిర్చి కోతకు వెళ్లి ఆటోలో తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో పాల్వంచ మండలం నాగారం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఆటో ఎడ్లబండిని ఢీకొట్టడంతో నెహ్రూనగర్‌కు చెందిన గడ్డం భారతమ్మ (60), ఇందిరాకాలనీకి చెందిన బాబూరావుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భారతమ్మ మృతి చెందింది. భారతమ్మ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులను వివరణ కోరగా వివరాలు రాలేదన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

వైభవంగా లింగమంతుల జాతర

- లింగమంతుల స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన యాదవులు, భక్తులు
- రేగా విష్ణు ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దు మారుమూల రేగులగండిలో గుట్టపై యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ భవానీ లింగమంతుల జాతర సోమవారం నిర్వహించారు. జాతర నిర్వహణ కమిటీ, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో సూర్యాపేట పెద్ద గట్టు జాతరకు అనుసంధానంగా రేగులగండి గుట్టపై లింగమంతుల జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆదివారం రాత్రి శివభవాని రథాల్లో రేగులగండి చేరుకున్న యాదవులు సోమవారం ఉదయం శ్రీ భవానీ లింగమంతుల స్వామి, చౌడాలమ్మకు బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమైంది. పూజారుల వేదమంత్రాలు నడుమ, భక్తుల జయజయ ధ్వానాల మధ్య శ్రీ భవానీ లింగమంతుల స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు తలనీలాలు, కానుకలు కానుకలు సమర్పించి కోళ్లు, మేకలు బలిచ్చారు. జాతరకు వచ్చిన భక్తులకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేయగా, ఆయన సతీమణి సుధారాణి ప్రారంభించారు. ఇక సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒగ్గు కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సింగరేణి యాజమాన్యం, జాతర నిర్వహణ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేశారు. కాగా, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొడగాని పరమేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ ఖమ్మం టౌన్ అధ్యక్షుడు పగడాల నాగరాజుయాదవ్, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వాపురం, మణుగూరు జెడ్పీటీసీ సభ్యులు సూదిరెడ్డి సులక్షణ, పోశం నరసింహారావు, ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ వీరభద్రం, మల్లెలమడుగు సర్పంచ్ కోడి కృష్ణవేణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సాగర్ యాదవ్, లింగమంతుల జాతర నిర్వహణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకెల రమేశ్, గంటా గోవర్ధన్, కోశాధికారి తోట శేషయ్య, ఉపాధ్యక్షులు కడారి నగేశ్, కందుల వెంకన్న, చింతల వెంకట్, కార్యదర్శులు దావ వీరస్వామి, రమేశ్, బొల్లం వలరాజు, యాదవ సంఘం మండల అధ్యక్షులు బండారు జనార్దన్, మారుతి శ్రీనివాస్, రెడ్డిబోయిన సైదులు, మంగి వీరయ్య, మేకల ఆది లింగయ్య, నక్కనబోయిన పాపారావు, తోట కృష్ణయ్య, కడారి గురవయ్య, మంగి మల్లికార్జున్, మల్లెబోయిన నాగేశ్వరరావు, బొబ్బాల నాగేశ్వరరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.



జాతరకు హాజరైన భక్తులతో ఎమ్మెల్యే రేగా సతీమణి సుధారాణి, ప్రజా ప్రతినిధులు

ఆకట్టుకున్న ఒగ్గు కళాకారుల నృత్యం..

'హో లింగా.. హో లింగా'.. అంటూ రేగులగండి గుట్ట మారుమ్రోగింది. శ్రీ భవానీ లింగమంతుల జాతరలో యాదవ కులానికి చెందిన ఒగ్గు కళాకారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయబద్ధంగా హోలింగా.. హోలింగా అంటూ లింగమంతుల స్వామిని కొలుస్తూ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. శివసత్తులు పూనకాలతో లింగమంతుల స్వామిని కొలిచారు. జాతరలో యాదవ ఒగ్గు కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒగ్గు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో రేగులగండి గుట్ట మారుమ్రోగగా భక్తులు జాతరలో ఉత్సాహంగా గడిపారు.



లింగమంతుల జాతరలో ఒగ్గు కళాకారుల నృత్యాలు

బడ్జెట్ ఎలా ఉందంటే..

'భద్రాద్రి'కి మళ్లీ రిక్త హస్తమే



భద్రాచలం: బడ్జెట్‌లో భద్రాచలానికి మళ్లీ రిక్తహస్తమే చూపారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు, గోదావరి వరద ముంపు బాధితుల ఇళ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు ప్రస్తావనే బడ్జెట్‌లో లేదు. భద్రాచలం సమస్యలపై అసెంబ్లీలో అనేక మార్లు గళమెత్తుతున్నా ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. పోలవరం బ్యాక్ వాటర్ ముంపుతో నష్టం జరిగే భద్రాచలానికి, సీతారామ ప్రాజెక్టు వలన నష్టపోతున్న ప్రజానీకానికి తగిన నష్టపరిహారం వివరాల ప్రస్తావన లేకపోవడం ఆవేదనకు గురి చేసింది.

– భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

ఇంటి నిర్మాణానికి రూ.6.లక్షలు చెల్లించాలి



సింగరేణి(కొత్తగూడెం): సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు కాకుండా రూ.6 లక్షలు చెల్లించాలి. దళితబంధు పథకాన్ని నియోజకవర్గానికి కేవలం 1,100 మందికే చెల్లిస్తామనే పరిమితి సరికాదు. బడ్జెట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నా. అన్ని హామీల మాదిరిగానే దీనిని కూడా విస్మరించొద్దు. మిడ్ డే మీల్స్ కార్మికులకు రూ.3 వేల గౌరవ వేతనం చెల్లిస్తామని ప్రకటించటం మా పోరాటాల ఫలితమే. 80 వేల ఉద్యోగ ఖాళీలను పూర్తిచేస్తామని చెప్పిట్లుగానే వెంటనే పక్రియ మొదలుపెట్టాలి. ఇంకా సీతమ్మసాగర్ భూనిర్వాసితులకు పరిహారం, పోలవరం బ్యాక్ వాటర్ సమస్య, గోదావరికి కరకట్ట నిధులపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదు.

– ఎస్‌కే సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఇది ఎన్నికల బడ్జెట్



కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర బడ్జెట్ ముమ్మాటికీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినదే. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన 80వేల ఉద్యోగాల్లో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఈసారి కూడా నిరుద్యోగ భృతితో పాటు విద్యారంగం, గిరిజనబంధుకు నిధులు కేటాయించకపోవడం నిరాశకు గురిచేసింది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలకు 12 శాతం నిధులు కేటాయించే అవకాశం ఉన్నా అలా జరగలేదు.

– యెర్రా కామేశ్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మన ఊరు- మనబడి'కి కేటాయింపులేవి?



భద్రాచలం: రాష్ట్రబడ్జెట్ కేటాయింపులో మన ఊరు–మన బడి పథకానికి నిధుల కేటాయింపు లేకుండా ప్రభుత్వ విద్యపై సర్కారు నిర్లక్ష్యం చూపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,90,396 కోట్ల బడ్జెట్లో పాఠశాల విద్యకు రూ.16,092 కోట్లు అనగా 5.54%, ఉన్నత విద్యకు రూ.3,001 కోట్లు అనగా 1%, మొత్తంగా బడ్జెట్లో 6.57% మాత్రమే కేటాయించడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తేటతెల్లం చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మన ఊరు- మనబడి', 'మన ఊరు – మన బస్తీ'కి బడ్జెట్లో కనీస నిధులను కేటాయించదు. ఏడాదికి 1000 పాఠశాలలను ఈ పథకం ద్వారా అభివృద్ధి చేస్తే, మొత్తం రాష్ట్రంలోని సుమారు 26000 పాఠశాలలకు 26 సంవత్సరాలు పడుతుందని తెలిపారు. విద్యారంగానికి మొత్తం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని చేసిన కొఠారి కమిషన్ సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని భూస్థాపితం చేస్తున్నాయి.

– మునిగడప రామాచారి టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

'గిరి వికాసం'తో చిన్నారుల అభివృద్ధి



గిరిజనదర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్



గిరి వికాసం పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న పీఓ

- ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు
- బోధన పరిశీలన, గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

భద్రాచలం: బధిరుల కోసం ఏర్పాటు చేసిన 'గిరి వికాసం'తో మెరుగైన మార్పు వచ్చేలా బోధన సాగాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలో నడుస్తున్న గిరి వికాసం పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోధనా తీరు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాక ఆయన మాట్లాడారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన జరపాలని సూచించారు. అలాగే, వారిని కంటికి రెప్పలా కాపాడుతూ అన్ని రకాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రతినెల వైద్యశిబిరాలు, సదరం క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌ఓ ప్లాంట్ కోసం రూ.4.50 లక్షలు, నీటి సరఫరా కోసం మరో రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కాగా, బోధన గదిలో సౌండ్ ప్రూఫ్ బోర్డులు, చదువుకు సంబంధించిన పెయింటింగ్‌లు వేయించాలని పీఓ సూచించారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించండి

గిరిజన దర్బార్‌లో గిరిజనులు వెల్లడించే సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌లో భాగంగా ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి యూనిట్ అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింగ్‌రావుతో పాటు అధికారులు అరుణకుమారి, అనిత, హరీశ్, కృష్ణవేణి, అరుణ, పద్మ, ప్రియాంక, తానాజీ, సురేశ్ బాబు, భాస్కర్, ఆదినారాయణ, శ్రీనివాస్, మునీర్ పాషా, ప్రభాకర్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

డీజిల్ డబ్బాతో మహిళ హల్‌చల్

పినపాక: అకారణంగా తన భర్తను సస్పెండ్ చేశారని పినపాక ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకులు మోహన్‌రెడ్డి భార్య మండల పరిషత్ కార్యాలయంలో డీజిల్ డబ్బాతో హల్‌చల్ చేశారు. సోమవారం కార్యాలయానికి తన భర్త చేరుకున్నా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఇచ్చిన లేఖను అందజేసేందుకు వచ్చిన కార్యాలయ అటెండర్ కూడా అసభ్యకరంగా మాట్లాడారని, లేఖ తీసుకోని పక్షంలో ఇంటిని సీజ్ చేస్తామని ఎంపీడీఓ ఆదేశించారని ఆమె ఆరోపించారు. అకారణంగా తొలగించిన తన భర్తను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



డీజిల్ డబ్బాతో వచ్చిన మహిళ

నాటకాలు.. జీవిత దృశ్యమాలికలు

'తానా' మాజీ అధ్యక్షుడు జయశేఖర్



మాట్లాడుతున్న జయశేఖర్



చిన్నారి నాట్యం..



ఇతిహాసం నాటకంలో ఓ సన్నివేశం

భద్రాచలంటౌన్: నాటకాలు జీవిత దృశ్యమాలికలని, ఆది నుంచి తెలుగునాటక రంగం సమాజాన్ని సంస్కరిస్తూ, ఆలోచింపచేస్తూ, వీక్షకులకు చక్కని సందేశాలందిస్తూ వస్తోందని తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ అన్నారు. భద్రాచలంలో జరుగుతున్న అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబరాలకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటక రంగానే జీవితంగా చేసుకున్న కళాకారులను సత్కరించడం అదృష్టమన్నారు. సినీ రచయిత, జానపద గాయకులు గిద్దె రామనర్సయ్యతో పాటు భద్రాద్రికి చెందిన దర్శకులు, నిర్మాత తాండ్ర వెంకటరమణను ఘనంగా సత్కరించారు. అల్లం నాగేశ్వరరావు, తాళ్లూరి పంచాక్షరయ్య, తిప్పన సిద్ధులు, వంశీ, అనితా రాణి పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు..

నాటకోత్సవాల్లో భాగంగా రెండో రోజు తొలుత చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. అనంతరం మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో ఇతిహాసం నాటికను ప్రదర్శించారు. అమ్మ ప్రేమ, బిడ్డలపై అమ్మ చూపించే అప్యాయత, అమ్మను గొప్పగా చూసుకునే ప్రతి బిడ్డ అదృష్టవంతుడే అనే కోణంలో నాటకం కొనసాగింది. ప్రతి సన్నివేశం కటతడి పెట్టించడంతోపాటు ఆలోచింపజేసింది. మ్యాజిక్ షో అలరించింది.

వైభవంగా అమ్మవారి జాతర షురూ




గ్రామసరిహద్దుల్లో పొలిమేరలు కట్టేందుకు వెళ్తున్న ఆలయ పూజారులు

దుమ్ముగూడెం: మండలకేంద్రంలో వెలిసిన గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి 22వ జాతర సోమవారం వైభవంగా ప్రారభమైంది. ఆలయ పూజాలు రోజంతా ఉపవాసం ఉండి సోమవారం తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొలిమేరలు కట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. తొలి రోజు ఉదయం చిన్ననల్లబల్లి గ్రామానికి చెందిన దోసపాటి రాజేశ్, కవిత దంపతులు సమర్పించిన పట్టుచీరతో.. మధ్యాహ్నం ఎటపాక గ్రామానికి చెందిన రామారావు–గంగాభవాని దంపతులు సమర్పించిన పట్టుచీరతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి వటవృక్షం వద్ద నుంచి పుట్ట బంగారం తెచ్చే కార్యక్రమాన్ని అశేష భక్తజనం నడుమ మేళతాళాలతో ఘనంగా నిర్వహించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన దివంగత వేముల సాంబయ్య జ్ఞాపకార్థం సుబ్బమ్మ కుటుంబ సభ్యులు సమర్పించిన పట్టుచీరతో అమ్మవారిని అలంకరించారు. తాడేపల్లికి చెందిన గుడ్‌విల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బంగారు నామాలు వితరణ..

శ్రీముత్యాలమ్మ అమ్మవారికి జాతరలో భద్రాచలానికి చెందిన పెండ్యాల శ్రీనివాసరావు–స్వప్న దంపతులు రూ.లక్ష విలువ గల బంగారు నామాలను ఆలయ కమిటీకి వితరణగా అందజేశారు. బంగారు నామాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్త కలెక్టరేట్‌లో బ్యాంకింగ్ సేవలు ఎన్నడు?




నూతన కలెక్టరేట్ సముదాయం

చుంచుపల్లి: కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టరేట్ సముదాయాల్లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు, ప్రజలు, సిబ్బంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నూతన కలెక్టరేట్ సముదాయంలో 40కి పైగా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేశారు. సుమారు 550 మంది ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త కలెక్టరేట్ భవన సముదాయాలను గత నెల 12న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొత్తగూడెం పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాన్నీ కొత్త కలెక్టరేట్‌లోకి మారాయి. వివిధ శాఖల పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజూ వివిధ రకాల ఆర్థిక లావాదేవీలతో పాటు ప్రభుత్వ పరమైన పనుల మీద బ్యాంకులను ఆశ్రయించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు చలానాలు, డీడీలు, పలు రకాల చెక్కుల మార్పిడి, ఇతర అవసరాలకు నగదు జమ, విత్‌డ్రాలు వంటి పనుల కోసం నిత్యం వివిధ బ్యాంకులకు వెళ్లాల్సి ఉంటుంది. ఇక కలెక్టరేట్ తర్వాత అతి పెద్ద శాఖ అయిన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పరిధిలో మహిళా సంఘాలకు సంబంధించి నిత్యం బ్యాంకు లింకేజీ వ్యవహారాలు కొనసాగుతుంటాయి. పలు ప్రభుత్వ శాఖలకు సైతం బ్యాంకులు తమ అవసరాలను తీరుస్తుంటాయి. అయితే, బ్యాంకులో పని ఉంటే ఉద్యోగులు 6–7 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన బ్యాంకులను సంప్రదించాల్సి వస్తోంది. ప్రభుత్వ పరమైన ఉత్తరాల బట్వాడాకు పోస్టల్ సేవలు సైతం అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది కొత్తగూడెం రావడానికి శ్రమిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కొత్త కలెక్టరేట్ సముదాయంలో బ్యాంకింగ్‌తో పాటు ఏటీఎం సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు ఉద్యోగులు, కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపును రద్దు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని.. అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాలతో కార్మికుల సమస్యలపై సంప్రదింపులు జరపాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌తోపాటు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. తాము హైకోర్టును ఆశ్రయిస్తే మూడు మాసాల్లో ఎన్నికలు నిర్వహించాలని ఇచ్చిన తీర్పు గడువు ఈ నెల 28తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మిరియాల రంగయ్య, కందుకూరి రాజారత్నం, ఏవీఎస్ ప్రకాశ్, ఆర్.చంద్రమోహన్, దమ్మాలపాటి శేషయ్య, రాజ్‌కుమార్, వైవీ రావు, బాజీ సైదా, వంగా వెంకట్, కె.సారయ్య పాల్గొన్నారు.



డీవైసీఎల్‌సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భార్యను పంపలేదని భర్త ఆత్మహత్య

టేకులపల్లి: భార్యను ఇంటికి పంపలేదనే మనస్తాపంతో పురుగులమందు తాగిన భర్త చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బోడు ఎస్‌ఐ బత్తిని రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన పూనెం వెంకటేశ్వర్లు (28)కు అదే గ్రామానికి చెందిన సంధ్యారాణితో 11 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉండగా, తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో సంధ్యారాణి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లగా, ఈ నెల 3న వెంకటేశ్వర్లు వెళ్లి అడిగితే పెద్దవాళ్లను తీసుకు రావాలని అత్తామామలు సూచించారు. దీంతో వెంకటేశ్వర్లు ఒడ్డుగూడెం సమీపాన పురుగుల మందు తాగి తిరిగి అత్తగారింటికి వెళ్లి విషయాన్ని చెప్పారు. వారు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

మతిస్థిమితం లేక వ్యక్తి..

పాల్వంచ: మానసిక స్థితి బాగోలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దంతెలబోర గ్రామపంచాయతీ ఎర్రబోరుకు చెందిన ముసకి నవీన్ (35) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి పదేళ్లుగా మానసికస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఏడాది కిందట ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆదివారం సైతం పురుగుల మందు తెచ్చుకుని తాగాడు. గుర్తించిన భార్య ఐయితమ్మ వెంటనే భద్రాచలం ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సోమవారం ఐతమ్మ పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.